
# కావ్యయోగంలో కాంతిరేఖ



**కోకిల** కలకూజితాలూ, మయూరి నాట్య విన్యాసాలూ, సెలయేళ్ల మంజీర శింజితాలూ, వాసంత సమీరాలూ, తుమ్మెదల ఝుంకారాలూ, ప్రియురాళ్ల మధురాధరాలూ, పుష్ప సౌరభాలూ, శరజ్జ్యోత్స్నలూ, మధురాసవాలూ, విరహ గీతికలూ — ఇవన్నీ గుండెల్లో పొదువుకుని, నరాల్లో నింపుకుని, రక్తంలో జీర్ణించుకుని ఇంతకు పూర్వం ఎన్నో అపూర్వ శృంగార ప్రబంధాలు నిబంధించిన కవికుమారులు ఈ రోజున ఎందుకో మౌనంగా కనులు మూసుకుని, తీవ్రంగా ఏదో ఆలోచిస్తూ ఉన్నారు.

రాజసభ నుంచి తిరిగివచ్చినప్పటినుండి కవిలో వచ్చిన మార్పేమిటో అర్థం చేసుకోలేక, అలాగని ఆ స్థితిలో ఆయనను పలకరించి 'సంగతేమిటి?' అని ప్రశ్నించే ధైర్యమూ లేక నిస్సహాయంగా ఆయనకేసే చూస్తూ కూర్చుని ఉండిపోయింది రేఖ.

తూగుటుయ్యాలమీద ఒయ్యారంగా పడుకుని ఊహాలోకాల్లో ఊగుతూ విహరిస్తూన్న కవికుమారుని యౌవనశ్రీని కళ్లతోనే ఆస్వాదిస్తూ సమీపంలో ఆసనం మీద ఆసీనురాలయిఉంది రేఖ. పాము కుబుసంలాంటి ఉత్తరీయంలోనించి ఆయన సుకుమార దేహకాంతి వింత రంగులు విరజిమ్ముతూంది. తనకు శాంతినీ విశ్రాంతినీ ఇచ్చే ఆ విశాలమైన వక్షఃస్థలం, ఉచ్ఛ్వాస నిశ్వాసాల కారణంగా ఉత్తమ స్థితినీ సామాన్య స్థితినీ పొందుతూంది. సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన ఆ అందమైన ముఖం, అందులో ముఖ్యంగా ముఖానికే కాకుండా మొత్తం మూర్తికంతటికీ కూడా అపూర్వమైన అందాన్ని అందిస్తూన్న విశాలమైన నేత్రాలూ చూస్తూ పరవశత చెంది, అలాగే ఉండిపోయింది రేఖ. అరవిచ్చిన అరవిందాల్లా అరమోడ్పుగా ఉన్న ఆయన కళ్ల వైపు ఎంతసేపు చూసినా చూడాలని అనిపిస్తూంది. నిజానికి తాను ఆయన వైపు ఆకర్షించబడటానికి ఆయన కన్నే కారణం. ఈ సృష్టిలో ఉన్న సౌందర్యం అంతా కలబోసి, బహుశా ఆయన కళ్ళు చేశాడేమో భగవంతుడు! ఒకప్పుడు ప్రేమగా, ఇంకొకప్పుడు తీక్ష్ణంగా, ఒక్కొకసారి లాలనగా, మరొకసారి గంభీరంగా— ఇలా ఎన్ని రకాలుగానో హొయలుపోయే ఆయన చూపులు ఎప్పుడూ అందంగానే కనిపిస్తాయి రేఖకు. పుడమికి అవ్వలి వెలుగుల్ని దర్శించే ఆయన నేత్రాలు, ఎప్పుడూ ఏవో ఆలోచనల తరంగాలమీద విహరించే రెండు పూల పడవల్లా కనిపించాయి రేఖకు.

కవి కొద్దిగా కదిలారు. ఆలోచనలనించి తేరుకుంటున్నట్టున్నారు. ప్రభువు వారి కొలువుకు వెళ్లివచ్చిన తరవాత తనతో ఒక్కసారి అయినా మాట్లాడలేదు కవి. ఆస్థానపండితులు ఆ ఉదయం వచ్చి, "ప్రభువుగారు తమ దర్శనం కోసం సభలో వేచి ఉన్నారు అవశ్యమైన విషయం ఏదో మీతో ముచ్చటించాలట! మీరు ఆలస్యం చేస్తే తామే వస్తామన్నారు" అని చెప్పే సమయానికి తనతో కవి ఎంతో సంతోషంగా మాట్లాడుతున్నారు.

**లేత తమలపాకులకు పాల మీగడలాంటి సున్నం రాసి, చిలకలు చుట్టుతున్న తన్ను చూసి నవ్వుతూ,** "నేనిప్పుడు ఒక చక్కని శృంగార కావ్యానికి శ్రీకారం చుట్టబోతున్నాను. నూతన కావ్యారంభంలో కవికి కస్తూరి తాంబూలం సమర్పించడం సంప్రదాయం.

**మానవజాతిని కలవరపరిచే సమస్యలతో సతమతం అయ్యేవాడే రచయిత. మానవులందరి కష్టసుఖాలు ఖేదమోదాలు అతడి స్వంతాలు. రచయితకు ఎల్లలు లేవు. కనకనే ఏ కాలానికి, దేశానికి, జాతికి చెందినవారి రచనలయినా ఎల్లకాలమూ అందరినీ ఆకట్టుకొనగలుగుతున్నాయి.**

త్వరగా తాంబూలం ఇయ్యి" అన్నారు కవి.

తను నవ్వి, "అలాగే. కాని ఈలోగా నాదో చిన్న కోరిక" అంది తల వంచుకుని.

"సిగ్గు పడతావేం? చెప్పు" అన్నారాయన.

"ఈ కావ్యం నేను రాస్తాను. మీరు చెబుతూ ఉండండి."

"నువ్వు రాస్తావా? ఎప్పుడూ లేనిది ఈ కోరి కేమిటి నీకు?" అన్నారు ఆశ్చర్యంగా.

తను చిన్నబుచ్చుకుంది. వెంటనే ఆయన తనను అనునయిస్తూ, "అలాగేలే. నువ్వే రాద్దువుగాని" అన్నారు. కాని, తాను ఆయనకు తాంబూలం సమర్పించుకునేలోగానే ఆస్థాన విద్వాంసులు రావడం, ప్రభువు పంపిన కస్తూరి తాంబూలం కవి చేతిలో పెట్టి ప్రభువువారి ఆజ్ఞ తెలిపి తమతో తీసుకుని వెళ్ళిపోవడం జరిగింది. ఆ వెళ్ళడం వెళ్లడం ఇప్పుడు వచ్చారు సభ నుండి కవి. వచ్చినప్పటినించి మౌనంగా ఉన్నారు. రేఖకేమి పాలుపోవడం లేదు.

కొంచెంసేపటికి లేచి కూర్చుని రేఖవైపు శూన్యంగా కొన్ని క్షణాలు చూసి నిట్టూర్చారు ఆయన. రేఖ భయంతో, "ఏమిటలా ఉన్నారు? ఏం జరిగింది?" అంది. "అంతా చెబుతాను. ముందు నాకు కొంచెం మంచినీళ్లు తే" అని, అవి తీసుకుని స్థిమితపడ్డాక చెప్పడం మొదలుపెట్టారు.

"ప్రజలలో నీతి నియమాలూ, పాపభీతీ, ధర్మ చింతనా క్రమంగా సన్నగిల్లిపోతూండడం ప్రస్తావించి ప్రభువు ఇలా అన్నారు: 'విశృంఖలంగా ప్రవహిస్తూన్న ఈ ప్రజా జీవన వాహిని ఏ ప్రమాదమైన గమ్యానికి చేరుతుందో అని భయంగా ఉంది. నానాటికీ పెచ్చు పెరిగిపోతున్న ఈ అవినీతి, ఆర్థిక ప్రలోభం, ఆశ్రిత పక్షపాతం అరికట్టాలని ఎన్నో శాసనాలు చేశాను. ఎన్నో శిక్షాస్మృతులు ప్రకటించాను. కాని, ఏం లాభం లేకపోయింది. నా చట్టాలన్నీ తాత్కాలికంగా పని చేస్తున్నాయి. కాని, శాశ్వతమైన మార్పు తేలేకపోతున్నాయి. ఆ మార్పు హృదయ పరివర్తనం వల్ల రావలిసిందే కాని, భయపెడితే రాదు. అందువల్ల దూరం ఆలోచించి మిమ్మల్ని పిలిపించాను. ఈ సోదర ప్రజానీకం కళ్లు తెరిపించి వాళ్ళను ఋజు మార్గంలో పెట్టే మహాకావ్యం ఏదైనా వ్రాయండి. ఇది మీకు తప్ప ఇతరులకు సాధ్యం కాదు.' నేనేమి సమాధానం ఇవ్వకపోవడం చూసి, 'మీరు ఇలా మౌనం వహిస్తే కాదు. ఇది ప్రజాహిత కార్యం. మీ రీ యుగానికి నాయకత్వం వహించక తప్పదు' అన్నారు. అప్పుడు నేను 'క్షమించండి. కవిత్వం బలవంతం మీద వచ్చేది కాదు. పైగా నాకు శృంగార కావ్యాలే వ్రాయడం అలవాటు: కాని, ఈ రకమైన ప్రబోధాత్మక కావ్యాలు వ్రాయడం అలవాటు లేదు. కాదుకూడదని ప్రభువులు ఆజ్ఞాపిస్తే, మరి తప్పుతుందా?' అన్నాను తీవ్రంగా. దాని కాయన, 'ఇది ఆజ్ఞ కాదు. అభ్యర్థన' అన్నారు. ఇంక నే నేమనను? 'సరే — ప్రయత్నిస్తాను' అంటూ సెలవు తీసుకు వచ్చేశాను."

అంతా విని రేఖ నిట్టూర్చి, "అయితే మిమ్మల్ని ఒక ప్రబోధాత్మక కావ్యం వ్రాయమన్నారన్నమాట!" అంది. కవి అవునన్నట్లు తల ఊపారు.

"ప్రబోధాత్మకమైనది ఒక నీతి శాస్త్రం అవుతుంది కాని, దానికి కావ్యత్వం ఎలా సిద్ధిస్తుంది?" అంది రేఖ.

"అదంతా వారి కెందుకు? శాసించడమే వారివంతు."

"నిరంకుశాః కవయః అన్నది ప్రభువులు మరిచినట్లున్నారు. మరి అయితే ఏం చెయ్యదలిచారు?"

"ఇంకా ఏమి నిర్ణయించలేదు. సూర్యాస్తమయాల సౌందర్యాలూ, వాసంత వనాంతర దివ్యశోభలూ, ప్రియురాలి ప్రేమ గీతాలూ అయితే నా కవితా పాటవాన్ని ప్రదర్శించి, నా భావాలకు అక్షర రూపాలు అమర్చగలను. కాని, కర్షకుని ఘర్మజలం, దరిద్రుని ఆకలి బాధ, పతిత స్త్రీ మనోవ్యధ—ఇవి నాకు పరిచయంలేని వస్తువులు. సామాన్య మానవ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని ఇవన్నీ వర్ణించాలంటే, ఎంతో తీవ్రంగా ఆలోచించాలి. ఎంతో నిశితంగా పరిశీలించాలి. ఎంతో లోతుగా అనుభవించాలి. చాలా శ్రమతో కూడుకున్న పంగతి. శారీరికంగానూ మానసికంగానూ కూడా విపరీతంగా మథనపడితేనే కాని, ఈ నూత్న కవితామృతం ఉద్భవించదు."

కొంతసేపటి వరకూ ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

తరవాత కవి, "నా కిదంతా ఆలోచిస్తూ ఉంటేనే మెదడు వేడెక్కి తలపోటు వస్తూంది. గంధం తీసి పన్నీటిలో కలిపి తీసుకుర్రా. కణతలకి వేసుకోవాలి" అన్నారు.

రేఖ లోపలికి వెళ్ళింది.

కవి ద్వారం గుండా వీధిలోకి చూస్తూ ఆలోచిస్తున్నారు. ఒకవేళ తా నీ కావ్యాన్ని వ్రాయడం తప్పకపోతే ఏంచెయ్యాలి? శృంగార కావ్యాల్లాగ, దీన్ని మందిరంలోనే కూర్చుని, కేవలం తన ఊహాబలంతోనే సృష్టించడానికి వీలులేదు. ప్రజలలోకి వెళ్లాలి తాను. వాళ్ల కష్టసుఖాలు గమనించి అవి తనవిగా అనుభవించాలి. తాను దర్శించిన వారి జీవిత సత్యాలకు ఒక కావ్యత్వాన్ని కల్పించి ప్రదర్శించాలి. ఇందుకోసం ప్రజలు ఉపయోగించే భాషనే తాను వాడాలి. అయితే తనకు ప్రోద్బలం కలిగించి తనలో కవితావేశాన్ని రగుల్కొల్పగల రసవద్ఘటనలు ఈ సామాన్య ప్రజా జీవితంలో ఎక్కడ ఉంటాయి?

ఇలా ఆలోచిస్తున్న కవికి అంతరాయం కలిగింది.

**పి. రాజ్యలక్ష్మి**

వీధిలోనించి ఆక్రందనలూ ఆర్తనాదాలూ వినిపించేసరికి లేచి వీధిలోకి వెళ్లారు. పాపం రంగయ్యసెట్టి ఏకైక పుత్రుడు ఇరవైఏళ్లవాడు హఠాత్తుగా గుండెఆగి చనిపోయాడట! పైగా దారుణమైన సంగతేమంటే, ఇవాళ రంగయ్యసెట్టి షష్టిపూర్తి మహోత్సవం. బంధుమిత్రులంతా కలిసి సంపన్నుడైన రంగయ్యసెట్టిని గులాబీ దండలతో గౌరవిస్తున్న సమయంలోనే ఆ విషాదకరమైన సంఘటన జరిగింది. ఆ దండలతోటే కొడుకు శవాన్ని అలంకరించి శ్మశానానికి తీసుకువెళ్ల వలసివస్తుందని రంగయ్యసెట్టి కలలోనైనా అనుకున్నాడా?

కవికి కళ్ళు చెమర్చాయి. శరీరంతోపాటు మెదడు కూడా సలసల కాగిపోతూంది. తలనెప్పి విపరీతం అయింది. లోపలికివచ్చి నిశ్చేష్టుడై కూర్చుండిపోయారు. 'ఇదేమి సంఘటన భగవంతుడా! రంగయ్యసెట్టి ఏం మహాపాపం చేశాడని అతని కింత శిక్ష?' వెంటనే కవికి కొన్ని పూర్వ సంఘటనలు జ్ఞాపకం రాసాగాయి.

వ్యాపారంలో రంగయ్యసెట్టి అంత జిత్తులమారి ఇంకొకడు లేడని ప్రతీతి. ప్రజల జీవితావసర వస్తువులు ఎన్నిమార్లో దాచేసి రూపాయికి రూపాయి లాభాలు వేసుకుని అమ్మి ప్రజల బాధలే పునాదులుగా వేసి, ఎన్నో భవనాలు కట్టాడు. ఇక విపరీతమైన వడ్డీకి ధనాన్ని అప్పు ఇచ్చి స్వాధీనం చేసుకున్న ఆస్తులూ కూల్చివేసిన సంసారాలూ లెక్కేలేదు. ప్రభుత్వ కోశాధ్యక్షుణ్ణి వలలో వేసుకుని తన వ్యాపారం అపారంగా అభివృద్ధి అయ్యే అవకాశాలు సంపాదించాడు. మొన్నటికి మొన్న, సమర్థులైనవారు ఎందరో ఉండగా, ఏవిధంగానూ సామర్థ్యంలేని తన బావమరిదిని ఆస్థాన వణిక్ ప్రముఖుడుగా నియోగింపచేశాడు తన పలుకుబడి ఉపయోగించి.

ఈ పాపాలేనా అతనికి ఈ రోజున ఇంతటి కష్టాన్ని తెచ్చిపెట్టడానికి కారణం? భగవంతుని శిక్షాస్మృతి విచిత్రంగా కనిపించింది కవికి. వెంటనే కొన్ని నూతన సత్యాలు అర్థమైనట్లు ఆయనకు తోచింది.

ఆ ఆలోచనలతో కవికి ముచ్చెమటలు పోశాయి. చెమట పట్టిన నుదుటిపై చల్లని దక్షిణ వాయువు సోకి మనస్సుకు ఎంతో హాయి ఇచ్చింది. తలనెప్పి తగ్గింది. అంతలో రేఖ మంచిగంధం తెచ్చింది. అది చూసి కవి నవ్వుతూ, "రేఖా! ఇంక గంధం అవసరం లేదు. తలనెప్పి తగ్గిపోయింది. నేను ఘర్మ జలానికే సేద దేరడం నేర్చుకున్నాను. లేకపోతే ప్రభువు నాపై ఉంచిన భారాన్ని నిర్వహించడం ఎలా?" అన్నారు. కవి మాటలు కొత్తగా వినిపించాయి రేఖకు. లలితంగా శ్రావ్యంగా ఉండే ఆయన స్వరం, దృఢంగా గంభీరంగా వినిపించసాగింది. అంత వరకూ అరమోడ్పుగా ఉంటూ వచ్చిన ఆయన కళ్ళు విస్ఫారితాలై ప్రతి వస్తువునూ తీక్ష్ణంగానూ నిశితంగానూ చూస్తున్నాయి. ఆ కళ్లలో ఏదో నూతనమైన కాంతి [illegible]కూంది. తాను అమితంగా ప్రేమిస్తూ, ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకుంటూన్న ఆయన నేత్రాల్ని, వాటి సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ, తన చేతిలో ఉన్న గంధం పేరుకోవడాన్ని కూడా గమనించలేదు రేఖ. ఉన్నట్టుండి "ఇప్పుడే వస్తా"నంటూ పైమీద ఉత్తరీయం వేసుకుని వెళ్లిపోయాడు కవి. ఎంతో ముఖ్యావసరం ఉంటేనే

కాని గడప దాటని ఆయన, ఇంత హఠాత్తుగా ఎండలో ఎందుకు వెళుతున్నట్లో?

ప్రతి రోజూ ఎప్పటికి వెళ్లి, కొన్ని గంటలు గడిపి వస్తున్నారు కవి. ఇంట్లో ఉన్నప్పుడేనా ఆపూర్వపు మందస్మితాలూ, మర్మోక్తులూ లేవు. పుష్ప సౌరభాలూ మధురాసవాలూ శరజ్జ్యోత్స్నలూ ఇప్పుడాయనకు ఏమీ అక్కరలేక పోతున్నాయి. మనిషి బాగా చిక్కి నల్లబడి పోయారు. కాని, ముఖంలోనించి ముఖ్యంగా నిశితంగా చూసే ఆ కళ్లలోనించి ఏదో దివ్యకాంతి ప్రసరిస్తూ ఉంది. యజ్ఞదీక్షితుడైన సోమయాజిలా కనిపించ సాగారు రేఖకు. పూర్వం చల్లని వెన్నెలలు కురిపించే సుధాకరుడయితే, ఇప్పుడు మింట మంటలు పుట్టించే ప్రభాకరుడులా కనిపిస్తున్నారు. అందుకే ఆయనను సమీపించడానికి కాని, పలకరించడానికి కాని ధైర్యం లేక పోతూంది ఆమెకు.

ఆరోజు శ్రావణ పౌర్ణమి. చంద్రుడు సర్వకళలతోను ఆకాశంలో విహరిస్తూ తన నవ్వు వెన్నెలలు లోకంమీద కురిపిస్తున్నాడు. తదేక దృష్టితో జాబిల్లికేసి చూస్తూ, ద్వారం గుండా లోపలికి పడుతూన్న వెన్నెల్లో సమాధి నిష్ఠులై కూర్చుని ఉన్నారు కవి. ఆ సమయంలో ఆయన కళ్లు మరీ వింతకాంతితో వెలిగిపోతున్నాయి. రేఖకు భయం వేసింది, ఆ కళ్లకేసి చూస్తే.

రెండు రోజులక్రితం కవి తనతో ఇలా అన్నారు:

"ఈ నవ్య కావ్యాన్ని వ్రాయడానికై ఇన్నాళ్లూ ప్రజల మధ్య తిరిగి, వారి జీవిత విధానాల్నీ, నైతిక విలవల్నీ, మంచిచెడుల సంఘర్షణలోపడి నలిగి పోతున్న వారి శక్తి సామర్థ్యాల్నీ, తుదకు వారు ఉపయోగించే భాషనీ నిశితంగా పరిశీలించి పదిలపరిచాను. ఇక వీటి అన్నిటికీ ప్రాతినిధ్యం వహించే రక్త పూర్ణము మాంసలము అయిన పాత్ర సృష్టి జరగాలి. అందుకు చైతన్యమూర్తి అయిన కవితావేశం నాలో ప్రవేశించాలి. ఆ సుముహూర్తం ఎప్పుడు వస్తుందా అనే ఎదురు చూస్తున్నాను. కాని, ఒక్క విషయం. ఈ మహా ప్రయత్నంలో నే నొక నూతన సత్యాన్ని గ్రహించాను. నూనె తాగుతూ వత్తి భుజిస్తూ లోకాలకు వెలుగు ఇచ్చే దీపంలాగే, ఈ కవితాజ్యోతి కూడా కవి రక్తమాంసాల్ని ఆహుతి చేసుకుంటూ విశ్వశ్రేయస్సు కలిగిస్తుంది. ఇది ఒక యజ్ఞం. ఈ మహా యాగంలో ఏది హోమం చేయవలసివస్తుందో మరి!"

కవి అన్న ఈ మాటలు తలుచుకుంటే రేఖ శరీరం ఒక్కమారు ఝల్లుమంది. మళ్లీ చూడగలనో లేనో అన్నట్లుగా ఆయన కళ్లకేసే చూస్తూండగా రేఖకి మాగన్నుగా నిద్ర పట్టింది.

"రేఖా" అన్న కేకకు ఉలిక్కిపడి లేచింది రేఖ.

ఆ కంఠంలో ఆమె కేదో అపశ్రుతి వినిపించింది.

అది పూర్వ పరిచితమైన కంఠంలా అనిపించలే దామెకు. ఇంకో లోకం నించి వినిపించినట్లుగా భ్రాంతి పడింది. కంగారుగా లేచి కవికేసి చూసింది. కళ్లు మూసుకుని నిశ్చలంగా కూర్చున్నారాయన. ఆయనకేసే చూస్తూ ఉండిపోయింది రేఖ.

"ఏం రేఖా! ఎక్కడున్నావు?" అంటూ కళ్లు తెరవ కుండానే గాలిలో ఇటూ అటూ చేతులతో తడిమారు కవి.

"అదేమిటి? అటు తడుముతారు నే నిక్కడే కూర్చుంటే?" అంది భయంతో కూడిన ఆందోళనతో.

శ్రమజీవి



చిత్రం—టి. ఎస్. స్వామి (మురపాక)

# కావ్యయాగంలో కాంతిహోమం

"ఏం లేదు. త్వరగా వ్రాత సామగ్రి పట్రా. కవితా జ్యోతి దర్శనమయింది. వెంటనే కావ్యం వ్రాసి వెయ్యాలి" అన్నారు నిశ్చలంగా అలాగే కూర్చుని.

"ఇవిగో, తాటాకులూ గంటమూ. ఇక్కడ పెట్టాను" అంది రేఖ, కవి ముఖంలోకి ఆదుర్దాగా చూస్తూ.

ఆయన కన్ను తెరవకుండానే, "నా కెందుకు? నేను చెబుతాను. నువ్వు రాయి" అన్నారు.

"నేనా?"

"అవును. ఇంతక్రితం కోరుకున్నావుగా? నీ ముచ్చట ఇలా ఏర్పడం పడింది" అంటూ కావ్యాన్ని చెప్పడం ప్రారంభించారు.

• • •

నాడు విజయ దశమి!

ఆ రోజున కవి స్వయంగా తన నూతన కావ్యాన్ని సభలో గానం చేసి వినిపిస్తారని ప్రభువూ ప్రజలూ కూడా ఆశించారు. కాని, అలా జరగలేదు. తను రాకుండా, కావ్యాన్ని మాత్రమే సభకు పంపి ఊరుకున్నారు కవి.

"నేను బలవంతంగా ఈ కావ్యాన్ని వ్రాయించానని నామీద కోపం కాబోలు! అందుకే తాను రాకుండ కావ్యం మాత్రం పంపారు" అని నవ్వుకుని, కావ్యాన్ని చదివి వినిపించవలిసిందిగా ఆస్థాన విద్వాంసుల్ని కోరారు ప్రభువు.

శీల రహితమూ నీతి బాహ్యమూ అయిన జీవితాన్ని గడిపి, తుదకు మానసికమైన వ్యథతోనూ పశ్చాత్తాపం తోనూ దహించుకుపోయిన ఒక సంపన్నుని జాలి గాథ అది.

కావ్యం పూర్తి అయ్యేటప్పటికి ప్రభువుకూ ప్రజలకూ కూడా కళ్లనిండా నీళ్ళు నిండాయి. హృదయాలు బరువెక్కి కొంతసేపటి వరకూ ఏమీ మాట్లాడలేకపోయారు.

తమ హృదయాల్ని కరిగించి, తమ్ము కర్తవ్యోన్ముఖులుగా చేయగలిగిన అంతటి మహా కావ్యాన్ని రచించిన కవిని ప్రత్యేకంగా అభినందించ తలుచుకున్నారు ప్రజలు. అది సమంజసం అని అనిపించడం వల్ల, ఏ సంకోచమూ లేకుండా ప్రభువు కూడా వారితో బయలుదేరారు కానుకలు తీసుకుని.

ఆ సమయానికి రేఖ సహాయంతో తన ఉద్యానవనంలో తిరుగుతున్నారు కవి. ప్రభువూ ప్రజలూ రావడం చూసి, కవి చెయ్యి వదిలివేసి చెట్టుచాటుకు వెళ్లిపోయింది రేఖ. కవి కంగారుగా "రేఖా! రేఖా!" అంటూ గాలిలో చేతులతో తడుముతున్నారు.

కవి దీనస్థితి చూసి ప్రభువుతోపాటు వచ్చిన ప్రజలంతా నిర్విణ్ణులయిపోయారు. ఏమిటీ ఘోరం! ఎందు కిలా జరిగింది? దుఃఖంతో ఒక్కరి నోటి వెంటా మాట పెగిలి రావడం లేదు. బాధతో నిశ్చేష్టులై మ్రాన్పడి ఉండిపోయినవాళ్లందరినీ చూడటంతో, రేఖ హృదయంలో ఏర్పడిన ఆ గాయాన్ని మళ్లీ ముల్లుతో రేపినట్లయింది. ఆ చెట్టు వెనక నీడలో నిలబడిన రేఖ జీవితమే ఒక దట్టమైన నల్లని చీకటిగా అనిపించింది. ఆమెకు జరిగిన సంగతులన్నీ జ్ఞప్తికి రాసాగాయి.

అందులో ముఖ్యంగా ఆ శ్రావణపౌర్ణమినాటి రాత్రి- ఆ రాత్రి తన ఆనంద చంద్రుడు శాశ్వతంగా మేఘాల మాటుకు తప్పుకున్నాడు. లోకానికంత గా వెలుగు ప్రసాదించిన ఆ రాత్రి, తన తంపై మాత్రం ఇంత చీకటి గుమ్మరించి పోయింది.

ఆ రాత్రి ఆయన ముఖం చూస్తేనే తనకు భయం వేసింది. కళ్ళు తెరవకుండానే ఆయన కావ్యం చెప్పుకుపోతున్నారు. యాంత్రికంగా ఆయనచెప్పింది రాస్తున్నా, మనస్సులో కొండంత భయం. ఆయన కన్నులు తెరవరేం? అందమైన ఆ కళ్ళు అలా మూసుకునే కూర్చున్నారేం? ఎందుకో తెలియని భయం తనకు. అంతలో పరధ్యానంగా, "ఏం చెప్పనూ?" అన్నారాయన. "మీరే చదవండి. ఇవిగో" అంటూ అప్పటి వరకూ వ్రాసిన తాటాకులు ఆయనకు ఇవ్వబోయింది.

విషాదంతో కూడిన ఓ చిరునవ్వు నవ్వి ఆయన, "పిచ్చిదానా! నీకింకా అర్థం కాలేదా? ఇప్పుడు నువ్వు భయపడతావని దాస్తే మాత్రం ఏమయింది? తరవాతనైనా తెలియకపోతుందా? విను. నా కిప్పుడు ఏమి కనిపించడం లేదు. చంద్రుణ్ణి చూస్తుంటే ఇందాకా నా మెదడులో ఏదో తటిల్లతలా మెరిసింది. అంతే. ఇంక నాకు చంద్రుడు కనిపించడం మానేశాడు. ఒక్క చంద్రుడే అన్న మాటేమిటి? ఈ లోకమే నాకు అదృశ్యమై పోయింది. ఇప్పుడు నా కీ గదికాని నువ్వుకాని చంద్రుడుకాని ఎవ్వరూ కనిపించడం లేదు. నాకు కనిపిస్తున్నదల్లా ఒక్కటే. అదే నా కావ్యం సమగ్ర స్వరూపం."

"ఆఁ! ఏదీ, ఇలా చూడండి" అంది తాను. శబ్దం వచ్చిన దిక్కుగా ముఖం తిప్పి కళ్ళు తెరిచారు ఆయన.

ఆ కళ్లలో ఏముంది? కాంతి అంతా అంతరించి గాజు గుడ్లుగా మాత్రం మిగిలాయి అవి.

అంతే. తరవాత ఏం జరిగిందో తనకు తెలియదు. స్పృహ వచ్చి తను చూసేసరికి కవి తన ముంగురులు సర్దుతున్నారు. "ఏమిటీ ఘోరం! మీ కళ్లలో పూర్వం ఉన్న ఆ కాంతి ఏమైంది?" అంటూ ఏడ్చింది. కొంత సేపటికి ఆయన తనను ఓదార్చి, "రేఖా! జరిగినదానికి విచారిస్తూ కూర్చుంటే ఏం లాభం? తరవాత రాయి. చెబుతాను" అన్నారు.

"ఆయన చెప్పడం ... నేను రాయడం ... ఇంత దారుణంగా నా కోరిక నిజం అయింది" అంటూ పైట నోట్లో కుక్కుకుని చెట్టుచాటున మౌనంగా ఏడుస్తూ ఉండిపోయింది రేఖ.

ఎంతసేపటికీ రేఖ కనిపించక పోయేసరికి ఆదుర్దాగా "రేఖా! ... రేఖా!" అంటూ ఇటూ అటూ చేతులతో తడుముతున్న కవికి ప్రభువు చేతులు తగిలాయి. వెంటనే ప్రభువు కవి రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకుని పొంగి వస్తూన్న దుఃఖాన్ని అణుచుకుంటూ, "ఏమిటీ దారుణం! కనులు కనిపించక అంధకారంలో తారట్లాడుతూన్న ఈ మహాదేశానికి దివ్యలోచనాల్ని ప్రసాదించిన మీరే, ఇవాళ కనుల కాంతి కోల్పోయి అంధకారంలో పడిపోయారా?" అన్నారు.

కంఠ స్వరాన్ని బట్టి, వచ్చింది ప్రభువు అని గుర్తించి, ఆయన చేతుల్ని తన దోసిట్లోకి తీసుకొని, "తమరు దయచేశారా? కబురు చెయ్యకపోయారా?" అన్నారు కవి. దానికేం సమాధానం చెప్పకుండా, "ఇలా ఎందుకు జరిగింది? ఎప్పుడు జరిగింది?" అన్నారు, విషాదంగా ప్రభువు. కవి నిర్లిప్తతతో కూడిన చిరునవ్వు నవ్వి, "ప్రభూ! మీరు ఎరగనిది ఏముంది? ఆత్మార్పణ కూడా చేస్తే కాని యజ్ఞఫలం లభించదు గదా? మీరు లోకానికి వెలుగు ఇచ్చే కావ్యజ్యోతి కావాలన్నారు. నా కళ్ల కాంతి హారతి ఇస్తేనే కాని సరస్వతి ప్రసన్నురాలు కాలేదు. దానికేం? అన్నివేళలా శాంతినీ, అవసరమైన పరిస్థితుల్లో క్రాంతినీ వెదజల్లే దివ్యలోచనాలు నా ప్రజలకు నా కావ్యం వల్ల లభిస్తే, నాకు అదే చాలు. నేను పోగొట్టుకున్న ఈ కాంతి రేఖకి బదులుగా దేశీయులు ఋజుమార్గ వర్తనులయ్యారు కదా అనే శాంతిరేఖే నాకు శాశ్వతంగా మిగులుతుంది" అంటూన్న కవి కళ్లల్లో నించి రెండు ఆనంద బాష్పాలు రాలాయి. - లోకోపకారి అయిన ఆ యుగ ప్రవర్తకునికి అంజలి ఘటించి, ప్రభువుతో పాటు ప్రజలు కూడా నిరుత్తరులై ఉండిపోయారు. ★

తెరచాపల జంట ఫోటో—ఎస్. ఆర్. డి. మూర్తి (మద్రాసు-4)

